సాక్షి
చిత్తూరు
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



మా మొర ఆలకించండయ్యా!

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు అర్జీలతో తరలివచ్చారు. - 8లో



మరో వైఎస్సార్‌సీపీ నేత టార్గెట్

మరో వైఎస్సార్‌సీపీ నేతను లక్ష్యంగా చేసుకుని టీడీపీ గూండాలు వారం రోజులుగా దాడులకు తెగబడుతున్నారు. - 8లో



టూరిస్టు బస్సులో 'నెపోలియన్'

టూరిస్టు బస్సులో పాండిచ్చేరికి చెందిన మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఐటీఐ కళాశాలల్లో మూడవ విడత అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఐటీఐ కళాశాలల్లో మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్, చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మూడవ విడతలో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు ఈ నెల 29న, ప్రైవేట్ విద్యార్థులకు ఈ నెల 31వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 77999 33370ను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ ఉచితం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణత పొందిన గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న స్టడీ సెంటర్‌లో ఉచిత భోజనం , వసతులతో శిక్షణ ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న గిరిజన అభ్యర్థులు దరఖాస్తు, విద్యార్హత, కులధృవీకరణ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాసుపోర్టు సైజ్ కలర్ ఫొటోతో పాటు దరఖాస్తుపై గెజిటెడ్ అధికారి సంతకంతో అందజేయాలన్నారు. సంబంధిత దరఖాస్తులను చిత్తూరు కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోపు అందజేయాలని తెలిపారు. బీఈడీ, డీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగిన ఎస్టీ అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు, ఇతర అర్హతలు విద్యాశాఖ నిబంధనల మేరకు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్ ఉత్తీర్ణత మార్కుల ప్రకారం మెరిట్ జాబితా ప్రకారం ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 08572–241056ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్ఐసీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలు ఎస్ఐసీ పోర్టల్‌లో సంబంధిత వివరాలను నమోదు చేయాలని రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధికారులు జారీచేసిన ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అధికారులకు చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఎం శ్రీ పాఠశాలలు ఈ నెల 6వ తేదీలోపు ఎస్ఐసీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ నెల 7వ తేదీన పీఎంశ్రీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు ఓరియెంటేషన్ కార్యక్రమం ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

"మేం ఏం పాపం చేశాం..ఎవరికి అన్యాయం చేశాం.. పాడినే నమ్ముకుని బతుకున్నాం.. మాకు ఎందుకు రాజకీయాలు.. మా కడుపు ఎందుకు కొడుతున్నారు.. మాకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలి. అందరినీ ప్రశ్నించడమే లక్ష్యమంటూ చెప్పిన పవన్ మా గోడు పట్టించుకోవాలి"

అంటూ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పాడి రైతులు తిరుపతి కలెక్టరేట్‌ను ముట్టడించారు. అమూల్ సంస్థ ఈ నెల 21 నుంచి పాల సేకరణ నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో వందలాదిమంది పాడి రైతులు ధర్నా చేశారు. అమూల్ సంస్థపై కూటమి ప్రభుత్వ పెద్దల నుంచి రాజకీయ ఒత్తిళ్లు తేవడం వల్ల తమకు తీవ్రంగా అన్యాయం జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు



పాడి కడతారా...!

- పాడి పైనే ఆధారపడి బతుకుతున్న మాపై రాజకీయ కక్ష ఏల?
- బ్యాంకు రుణాలు తీసుకుని పాడి పశువులను కొన్నాం
- ఈ నెల 21 నుంచి పాల సేకరించలేమని చెప్పిన అమూల్ సంస్థ
- అమూల్ సంస్థకు కూటమి ప్రభుత్వం లోని పెద్దల నుంచి హెచ్చరికలు
- 20 వేల లీటర్ల పాలను ఎవరికి పోయాలి ?
- తిరుపతి జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో పాడి రైతుల ఆగ్రహం
- సీఎం సొంత సంస్థ హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకేనా..!

తిరుపతి అర్బన్: పాడిరైతులు బహిరంగ పోరాటానికి దిగారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ధర్నాకు దిగారు. పాడినే నమ్ముకుని బతుకుతున్న తమపై రాజకీయ కక్ష కడతారా ? అని గళమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ పాల సంస్థకు పాల సేకరణ అప్పగించారు. ఆ సంస్థకు పాలు పోయడం ద్వారా లీటర్‌కు రూ.34 నుంచి రూ.43 ఇప్పించి లబ్ధి చేకూర్చే కార్యక్రమం చేపట్టారు. అప్పటి నుంచి పాడి రైతులు కూడా ఆ అమూల్ సంస్థకు పాలు పోసి లాభాలు ఆర్జిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పాడి రైతులపై కక్ష కట్టింది. ప్రభుత్వ ఒత్తిళ్ల కారణంగా ఈ నెల 21 నుంచి అమూల్ సంస్థ పాల సేకరణ చేపట్టలేం అని చెప్పింది. దీంతో పాడి రైతులు సుమారు రోజుకు 20 వేల లీటర్లు పాలు ఒక్కసారిగా నిలుపుదల చేస్తే ఎవరికి పోయాలి ? అని గళమెత్తారు. న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందించి ఆక్రోశం వెల్లగక్కారు. దీంతో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఎటుచూసినా పాడి రైతులు, చిరుద్యోగులే దర్శనమిచ్చారు. కనిపించిన అధికారికల్లా వారి ఆవేదన, ఇక్కట్లను వివరించారు.

అమూల్‌తోనే లాభాలు

అమూల్ పాల సంస్థ లీటర్ పాలకు రూ.34 నుంచి రూ.42 వరకు చెల్లిస్తుంది. ప్రతి పది రోజులకు ఒకసారి రైతులకు పాల బిల్లులు అందిస్తోంది. ఆవులు, బర్రెల సంఖ్యను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అమూల్ సంస్థ ద్వారానే రుణాలు ఇప్పించారు. ఆ రుణం తీరిన వెంటనే తిరిగి మళ్లీ బ్యాంక్‌లో రుణం తీసుకునే సౌకర్యాలు కల్పించారు. ఏరోజు పాలకు ఆ రోజు పాల శాతాన్ని బట్టి ధరలు రైతుల లెక్కలో జమ చేస్తారు. దీంతో పాడి రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చేది.

ఇతర సంస్థలతో నష్టాలు

పాడి రైతుకు లీటర్‌కు రూ.24 నుంచి రూ.28కి మించి ఇవ్వరు. 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు అందించారు. ప్రధానంగా ఏ రోజు పాల శాతాన్ని బట్టి పాల రేట్లు ఇవ్వకుండా 15 రోజుల పాల శాతాన్ని లెక్కలోకి తీసుకుని రేట్లు ఇచ్చేవారు. దీంతో ఒక్కో రైతుకు నెలకు రూ.5 వేలు మేర నష్టం వచ్చేది. మరోవైపు బ్యాంకు రుణాలు ఉండవు. రైతులు అప్పులు చేసుకుని ఆవులు, బర్రెలను కొనుగోలు చేయాల్సి ఉంది. దీంతోనే పాడి రైతులు గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన అమూల్ పాల సంస్థకే పాలు పోయడానికి మక్కువ చూపుతున్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న పాడి రైతులు

అమూల్ పాల ఉత్పత్తులు ఇలా..

జిల్లాలో తొలిదశలో వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో అమూల్ పాల సేకరణ ప్రారంభించారు. దశల వారీగా జిల్లాలోని 34 మండలాల్లో అమూల్ పాల సేకరణ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే 5 మండలాల్లో 47 గ్రామాల్లో పాల సేకరణ 16 నెలల కిందట 1850 మంది రైతుల నుంచి 3,560 లీటర్ల సేకరణతో మొదలు పెట్టారు. ఆరునెలలు గడిచే కొద్దీ ఏకంగా 15,592 మంది రైతుల నుంచి 19,500 లీటర్ల పాలసేకరణకు చేరారు. విస్తారంగా రైతులకు వడ్డీలేని బ్యాంకు రుణాలు ఇప్పించడంతో రైతులు పెద్దఎత్తున పశువులను కొనుగోలు చేసి పాలను అమూల్ సంస్థకు అందించేవారు. దానికితోడు సరైన గిట్టుబాటు ధరలు అందుతుండడంతో ఆసక్తి చూపించేవారు. అయితే సీఎం చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్‌కు లాభం చేకూర్చేందుకు ఇలా చేస్తున్నారని రైతులు వాపోయారు.

ఈ నెల 21 నుంచి ఆగిపోనున్న పాల వెల్లువ

గత ప్రభుత్వం గ్రామాల్లో పాడి రైతులకు మేలు చేసే సహకార సంస్థను తిరిగి బలోపేతం చేయడానికి జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి గతేడాది శ్రీకారం చుట్టింది. అమూల్ కంపెనీకి పాలు విక్రయిస్తూ పాడి రైతులకు గిట్టుబాటు ధర పొందేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 103 గ్రామాల్లో పాల సేకరణ చేపట్టింది. ఇందుకు అవసరమైన బల్క్‌మిల్క్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుపతి జిల్లాలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాల్లో అమూల్ ఆధ్వర్యంలో పాల సేకరణ కార్యక్రమాలను చేపట్టింది. ధర కూడా ఇతర పాల డెయిరీల కంటే ఎక్కువగానే ఇచ్చే కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. అమూల్ డెయిరీ సిబ్బంది పాల సేకరణ జిల్లాలో ఈనెల 21 నుంచి నిలుపుదల చేస్తున్నందుకు చింతిస్తున్నామంటూ చెప్పడంతో మహిళా పాడి రైతులు లబోదిబోమంటున్నారు.

మాకు న్యాయం చేయండి



మా పాడి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి. కేవలం పాల ఉత్పత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకు ఆరుగాలం కష్టపడి పాలు అమ్ముకుంటే పాలకు ఇప్పుడు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే జీవనం ఎలా సాగించాలి ? మాకు అమూల్‌తోనే గిట్టుబాటు ధర వస్తుంది. ఆ సంస్థను కొనసాగించాలని కోరుతున్నాం.
– ఇందిర, మారసానివారిపల్లె, చిన్నగొట్టిగల్లు

న్యాయం కోసం పోరాటం



పాడి రైతులు న్యాయం కోసం పోరాటం చేయాల్సి ఉంది. ఎంతో శ్రమించి పాలను విక్రయిస్తే సరైన గిట్టుబాటు ధర ఇవ్వకుంటే ఎలా బతకాలి? మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అమూల్ సంస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ సంస్థను రద్దు చేయడం సరి కాదు.
– విమల,కురవపల్లె, చిన్నగొట్టిగల్లు

మాపై కూడా కక్షేనా?



బర్రెలను బాగా చూసుకుని పాల ఉత్పత్తులను పెంచుకోవడం. అమూల్‌కు పాలుపోయడం.. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ చేసుకోవడం మాత్రమే మాకు తెలుసు. అంతే తప్ప మాకు రాజకీయాలు తెలియవు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మా కష్టం మాకు తప్పదు అని భావించేవాళ్లం. అయితే హఠాత్తుగా అమూల్ సంస్థ పాల సేకరణ నిలుపుదల చేస్తున్నట్లు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాం. ఇది న్యాయంకాదు. అమూల్ సంస్థ ద్వారానే పాల సేకరణ ఉండేలా చూడాలని కోరుతున్నాం.
– మంజుల, ఎస్‌సీవీ పురం, వడమాలపేట మండలం

అమూల్ సంస్థతోనే లాభాలు..



పాడి రైతులకు అమూల్ సంస్థ ద్వారానే గిట్టుబాటు ధరలు ఇస్తున్నారు. ప్రధానంగా సరాసరిగా ఇస్తే మాకు నష్టం వచ్చేది. ఏ రోజు రేటు ఆ రోజు లెక్కించి ఇచ్చేవారు. అంతేకాదు రుణాలు ఇప్పించేవారు. ఇతర డెయిరీలతో పోల్చుకుంటే అమూల్ సంస్థ అధిక ధరలు ఉండేవి. మాకు రుణాలు ఇప్పించారు. ఆ రుణాలు కట్టాల్సి ఉంది. ఇలా పాల సేకరణ చేయకుంటే మేము రుణాలు ఎలా కట్టాలి ? మా బాధలు ప్రభుత్వం గుర్తించి మాకు తిరిగి అమూల్ నుంచి పాల ఉత్పత్తులు ఇప్పించాలి.
– ధనలక్ష్మి,వేణుగోపాల్‌పురం, పుత్తూరు మండలం

మా కడుపు కొట్టకండి సార్..



మేము ఏడాదిగా కష్టపడి అమూల్ సంస్థకు పాలు పోస్తున్నాం. రేట్లు వస్తున్నాయని పాల ఉత్పత్తులను పెంచుకోవడానికి మరిన్ని పశువులను కొన్నాం. ప్రభుత్వం మారడంతో అమూల్ సంస్థ పాల సేకరణ లేదంటే మేము ఎలా బతకాలి సార్. కేవలం పాడిపైనే ఆధారపడి బతుకుతున్నాం. లక్షలు పెట్టి పాడిని కొన్నాం. ఇప్పుడు అమూల్ సంస్థ వాళ్లు పాల సేకరణ చేయలేకపోతున్నాం అంటుంటే బాధగా ఉంది. జిల్లాలో 20వేల లీటర్ల పాలు ఎవరికి పోయాలి ? మా బతుకులే ప్రశ్నార్థకంగా మారాయి. మాకు న్యాయం చేయాలనే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నాం.
– గౌతమి, ఎలమంద, ఎర్రావారిపాళెం

అవకతవకలను సరిదిద్దండి



నిరసన తెలుపుతున్న బాధిత టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సీనియారిటీ జాబితాలో అవకతవకలను సరిదిద్దాలని టీచర్లు కదిరి రవి, సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత టీచర్లు సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఈ నెల 3న విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో పూర్తి అవకతవకలు ఉన్నట్లు తెలిపారు. సీనియారిటీ జాబితాలో స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారిని లాంగ్వేజ్ పండిట్‌లుగా చూపించడం అన్యాయమన్నారు. అనంతరం డీఈఓకు అభ్యంతరాలను అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన టీచర్లు కవిత, చంద్రకళ, రెడ్డెప్ప, లత, వినయకుమారి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం

- 10లోపు సిమ్‌లను 4జీగా అప్‌డేట్ చేసుకోవాలి
- జిల్లాలో 168 కొత్త టవర్లు
- గత నెలలో 19 వేల కొత్త సిమ్‌కార్డుల విక్రయం
- ఆగస్టు 15 నుంచి 4జీ సేవలు ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్:బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం ఆరంభమైంది. ఓ మోస్తరుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ప్రస్తుతం పెరుగుతోంది. ఇతర నెట్‌వర్క్‌లు మొబైల్ రీచార్జీలను గత నెల 3వ తేదీ నుంచి పెంచేశాయి. దీంతో కొందరు తమ నెట్‌వర్క్‌ను బీఎస్ఎన్ఎల్‌కు ఎంఎన్‌పీ (మొబైల్ నెంబర్ పోర్టబులిటీ) చేసుకుంటున్నారు. ఆ సంఖ్య కూడా గణనీయంగా పెరగడం విశేషం. పలువురికి మొబైల్ రీచార్జీల కాలపరిమితి ఈ నెలలో ముగుస్తుండడంతో ఆ మొత్తాన్ని వాడుకొని నెట్‌వర్క్‌కు మార్చుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

కొత్తగా 19 వేల సిమ్‌లు

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ అధికారికంగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు వాడుతున్నారు. ఇందులో ఉన్న వెసులుబాటు ఏమిటంటే తక్కువ టారీఫ్‌లతో రీచార్జీ ప్లాన్ అందుబాటులో ఉంది. గ్రామాల్లో సిగ్నల్స్ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. ప్రస్తుతం ఇతర నెట్‌వర్క్ మొబైల్ రీచార్జీల ధరలు పెరగడంతో జూన్‌లో 5వేల బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు అమ్ముడవ్వగా జూలైలో 19వేల సిమ్‌లు విక్రయించారు. ఇవి కాకుండా పోర్టబులిటీ కింద మరో 6 వేల మంది ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారారు. ఈ లెక్కన జూలై మొదటి వారం నుంచి బీఎస్ఎన్ఎల్‌కు భారీగా గిరాకీ పెరిగింది. పలు ప్రాంతాల్లో వివిధ దశల్లో 4జీ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మరింత మంది వినియోగదారులు పెరుగుతారని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఇంటర్ నెట్ స్లోగా ఉందని, సిగ్నల్స్ రాలేదని దాదాపు 5 వేల మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ నుంచి ఇతర నెట్‌వర్క్‌లకు వెళినట్లు అంచనా వేశారు.

మొట్టమొదటి టవర్

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ బాగుంటుంది. ఆ అంచనాను ఆసరాగా చేసుకొని ఇంతవరకు ఏ నెట్‌వర్క్ లేని పల్లెలను ఎంచుకొని అక్కడ టవర్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో ఆవులపల్లె, ఇరికిపెంట, గరనిమిట్ట, కంగుంది, అడవిబూదుగూరు, కీరమండడి, శివపురం, నదింపల్లె, మర్రికుంటపల్లె, రామసముద్రం, అలిపాలగుంట, కోసువారిపల్లె, తొప్పాలిపల్లెతో పాటు జిల్లా మొత్తం 168 గ్రామాలను ఎంపిక చేసి అక్కడ 4జీ టవర్ల నిర్మాణాలు చేపట్టారు. వీటి కోసం జిల్లా అంతటా సిబ్బంది సర్వే చేశారు.



బీఎస్ఎన్ఎల్ టవర్

బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా సమాచారం

మొత్తం వినియోగదారులు	3,25,000
ఫైబర్‌నెట్ వినియోగిస్తున్నవారు	28,000
ల్యాండ్‌లైన్ వినియోగదారులు	4,500
జూన్‌లో కొత్త వినియోగదారులు	6,000
జూలైలో కొత్త వారు	19,000
పోర్టబులిటీ జరిగినవి	6,000
మొత్తం టవర్లు	406
4జీ టవర్లు కొత్తగావచ్చేవి	168

- ఈ నెల 10వ తేదీ లోపు బీఎస్ఎన్ఎల్ 2జీ, 3జీ సిమ్‌కార్డు దారులు వారి సిమ్‌ను 4జీగా అప్‌డేట్ చేసుకోవాలి. అందుకుగాను కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తే వారు వివరాలు చెబుతారని అధికారులు పేర్కొన్నారు.
- ఆగస్టు 15 నుంచి తిరుపతి, తిరుమల, చిత్తూరు ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం కానున్నాయి.

ఆగస్టు 15 నుంచి అందుబాటులో..



జిల్లా వ్యాప్తంగా ఏ నెట్‌వర్క్ లేని 168 పల్లెలను ఎంపిక చేసి అక్కడ 4జీ టవర్లను నిర్మిస్తున్నాం. ఆగస్టు 15 నుంచి ఇవి దశలవారీగా అందుబాటులోకి వస్తాయి. రీచార్జీ ప్లాన్ ధరలు ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్‌లో తక్కువగా ఉన్నాయన్న విషయం అందరికీ తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్స్ మెరుగుపడుతున్నాయి. ఇటీవల సిమ్‌కార్డు సేల్స్, పోర్టబులిటీ పెరిగింది. – సురేంద్ర, డీఈ, బీఎస్ఎన్ఎల్

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. మైదానంలో వీఐపీలకు సీటింగ్, స్టేజి ఏర్పాట్లు చిత్తూరు తహసీల్దార్, డీఎస్‌ఓలు పర్యవేక్షించాలన్నారు. జిల్లా అభివృద్ధిని తెలిపే ప్రసంగ సందేశాన్ని, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ డీడీని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీపుల్లా, ఇన్‌చార్జి డీఆర్‌ఓ రాజశేఖర్, డీఎస్పీ మహబూబ్‌బాషా, డీఎస్‌ఓ శంకరన్, జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీపీఓ లక్ష్మీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో వైఎస్సార్‌సీపీ నేత టార్గెట్?

- కమ్మపల్లి వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యం రెడ్డి కోసం టీడీపీ వెతుకులాట
- సుబ్రమణ్యంరెడ్డి కుమార్తె వస్త్ర దుకాణంలోకి చొరబడి అద్దాలు ధ్వంసం
- వైఎస్సార్‌సీపీ నేత కోసం టీడీపీ నేతలు రోజంతా వెతుకులాట
- పుంగనూరులో మంత్రి పర్యటన నేపథ్యంలో టీడీపీ మూకల వీరంగం
- రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



వస్త్ర దుకాణంలోకి చొరబడిన టీడీపీ నేతలు (సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు)


టీడీపీ నేతలు పగలగొట్టిన దుకాణం అద్దాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మరో వైఎస్సార్‌సీపీ నాయకుడిని టార్గెట్ చేసేందుకు టీడీపీ నేతలు కుట్ర చేశారా? గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పుంగనూరులో సోమవారం మంత్రి పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనంగా తెలుస్తోంది. పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం కమ్మపల్లిలో సుమారు 150 కుటుంబాలు ఉన్నాయి. అందులో 13 కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు. మిగిలిన వారంతా టీడీపీకి చెందిన వారే. వీరంతా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు. కమ్మపల్లిలో సంఘమిత్ర మమత ఏడాది క్రితం పొదుపు సంఘాలకు చెందిన రూ.5 లక్షల నగదుని స్వాహా చేశారు. ఈ విషయం గత ఏడాది నవంబర్ 21న వెలుగులోకి రావడంతో స్థానికులు నిలదీశారు. డిసెంబర్ 9న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీకి చెందిన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని విచక్షణరహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో దాడులకు తెగబడిన వారిపై కేసులు నమోదు చేశారు. కట్ చేస్తే.. సాధారణ ఎన్నికల్లో బాధిత కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీకి ఓటువేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాది క్రితం జరిగిన సంఘటనను మనసులో పెట్టుకుని, గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 13 కుటుంబాలను లేకుండా చేయాలని నిర్ణయించుకున్నారు. జూన్ 5వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన 13 కుటుంబాలపై దాడులకు తెగబడ్డారు. నివాసాల్లోకి దూరి చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా విచక్షణరహితంగా చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోకి వచ్చి చూస్తుండిపోయారు. పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను చిత్రహింసలకు గురిచేశారు. టీడీపీ మూకల దాడులకు భయపడి సుబ్రమణ్యం రెడ్డి కుటుంబం అదే రోజు రాత్రి ఊరు విడిచి అడవిలోకి వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు బిక్కుబిక్కుమంటూ అడవిలోనే గడిపింది. అతికష్టంపై పుంగనూరులోని కుమార్తె జయంతి నివాసానికి చేరుకున్నారు. వీరిని తిరిగి రప్పించాలంటూ మిగిలిన 12 కుటుంబాలను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వీరి చిత్రహింసలకు భరించలేక మరో మహిళ ఊరొదిలి వెళ్లిపోయింది. ఇప్పటికీ ఎక్కడున్నారో తెలియదు.

మంత్రి పర్యటనలో స్కెచ్

వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి పుంగనూరులోని కుమార్తె నివాసంలో తలదాచుకున్న విషయం టీడీపీ నేతలు తెలుసుకున్నారు. విషయం తెలిసిన రోజు నుంచి కుమార్తె జయంతికి గ్రామంలోని బంధువుల నుంచి, స్నేహితుల నుంచి ఫోన్లుచేయించి బూతులు తిట్టేవారు. ఊర్లోకి రాకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సుబ్రమణ్యం రెడ్డి ఊర్లోకి రాకపోవడంతో పుంగనూరుకే వెళ్లి మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకు సోమవారం పుంగనూరులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటను వాడుకునేందుకు ప్రయత్నించారు. మంత్రి పర్యటన కోసం అంటూ కమ్మపల్లి నుంచి టీడీపీకి చెందిన కొందరు ప్రత్యేక వాహనాల్లో పుంగనూరుకు చేరుకున్నారు. సుబ్రమణ్యం రెడ్డి కుమార్తె నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలోకి చొరబడ్డారు. షాపులో ఉన్న టైలర్‌ని సుబ్రమణ్యం రెడ్డి, కుమార్తె జయంతి గురించి ఆరా తీశారు. దుకాణంలో రేపటి నుంచి పనిచేయవద్దని హెచ్చరించారు. లోపల ఉన్న కుట్టుమిషన్లు, అద్దాలు ధ్వంసం చేశారు. వెళ్తూ వెళ్తూ గదిని అద్దెకు ఇచ్చిన యజమానిని హెచ్చరించారు. దుకాణం వెంటనే ఖాళీ చేయించాలని హుకుం జారీ చేశారు. సుబ్రమణ్యం రెడ్డి కోసం సోమవారం రాత్రి వరకు గాలించారు. టీడీపీ నేతల స్కెచ్ మీడియాకు లీక్ అవడంతో పుంగనూరు నుంచి జారుకున్నట్లు సమాచారం.

ఆస్తులు, పంట ఉత్పత్తులు ధ్వంసం

సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని ఊర్లోకి పిలిపించేవరకు 12 కుటుంబాల వారికి చెందిన పంట దిగుబడులు, పాలు విక్రయించటానికి వీల్లేకుండా చేశారు. సుబ్రమణ్యంరెడ్డి ఇటుక బట్టీలను ధ్వంసం చేశారు. సుమారు 20 ఎకరాల్లోని టమాటా పంటను విక్రయించకుండా అడ్డుకోవటంతో పూర్తిగా పాడైపోయింది. కమ్మపల్లిలో బంధీలుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కుటుంబాలను టీడీపీ నేతలు మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమించమని అడిగి కాళ్లు పట్టుకునే వరకు వారిని విడిచిపెట్టలేదు. ఈ విషయాలు ఎవ్వరికీ తెలియకుండా, ఫొటోలు, వీడియోలు తీయకుండా టీడీపీ మూకలు వారి వద్ద ఉన్న ఫోన్లు లాక్కున్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబాల జీవనం సాఫీగా సాగాలంటే సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని ఊర్లోకి పిలిపించాలని ఒత్తిడి చేస్తున్నారు. మరో వైపు సుబ్రమణ్యంరెడ్డి కుటుంబాన్ని రప్పించేందుకు అప్పులుచేసి పారిపోయారని దుష్ప్రచారం చేశారు.

మా ప్రాణాలకు ముప్పు ఉంది



“కమ్మపల్లికి చెందిన రమేష్‌నాయుడు, చిట్టిబాబునాయుడు, త్రిలోక్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు తదితరుల నుంచి మా ప్రాణాలకు హాని ఉంది. మా అమ్మా నాన్నలతోపాటు నా కోసం వెతుకుతున్నారు. మా పంటలను ధ్వంసం చేశారు. ఇటుకలను ఎత్తుకెళ్లారు. పశువులకు మేతకూడా వేయకుండా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మమ్మల్ని, మా వాళ్లను చిత్రహింసలు పెడుతున్నారు. గ్రామంలో మా వాళ్లకు ఏం జరిగిందో, ఎలా ఉన్నారో కూడా తెలియదు. ఈ విషయం ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు.

– జయంతి, సుబ్రమణ్యంరెడ్డి కుమార్తె

విద్యుత్ చౌర్యానికి రూ.3.3 లక్షల జరిమానా

గుడిపాల: మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారికి రూ.3,32,000 జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో డీఈఈ మునిచంద్ర తెలిపారు. పాపసముద్రం, చిత్తపార, పిళ్లారికుప్పం, చింతగుంటూరు, బొమ్మసముద్రం, చలిచీమలపల్లె, కోటూరు గ్రామాల్లో సోమవారం తిరుపతి విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలాజి, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాలాజి, మూర్తి, ఏఈలు హరినాథ్, రాజ, చలపతి, కృష్ణయ్య, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ సర్వీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో అక్రమంగా విద్యుత్‌ను వినియోగించిన వారిపై 75 కేసులు పెట్టి రూ.3లక్షల 32వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

టూరిస్టు బస్సులో ‘నెపోలియన్’

- 120 ఫుల్ బాటిళ్ల పట్టివేత
- నిందితుడి అరెస్టు
- బస్సు సీజ్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ సిబ్బంది

పలమనేరు: పాండిచ్చేరి, కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్థానిక సెబ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. సెబ్ సీఐ సురేష్‌రెడ్డి కథనం మేరకు, పుంగనూరు సమీపంలోని బేటనూరుకు చెందిన గ్రామస్తులు తీర్థయాత్రల కోసం మదనపల్లెకు చెందిన ఓ ప్రైవేటు బస్సును బుక్ చేసుకున్నారు. వారం క్రితం యాత్రలకు బయల్దేరి సోమవారం సొంత గ్రామానికి చేరుకోవాల్సి ఉంది. గ్రామస్తులు పాండిచ్చేరి సందర్శనలో ఉండగా మదనపల్లెకు చెందిన బస్సు డ్రైవర్ కరమల రామాచారి 120 ఫుల్ బాటిళ్ల నెపోలియన్ బ్రాందీ బాటిళ్లను చౌకగా కొని బస్సు డిక్కీలో దాచుకున్నాడు. అక్కడి నుంచి గ్రామస్తులను ఎక్కించుకొని చిత్తూరు మీదుగా గంగవరం ఫ్లై ఓవర్ వద్ద వస్తుండగా కాపుగాచిన స్థానిక సెబ్ సిబ్బంది బస్సును తనిఖీ చేసి డిక్కీలో ఉన్న మద్యాన్ని సీజ్‌చేశారు. గ్రామస్తులను వేరే బస్సులో ఎక్కించి టూరిస్ట్ బస్సును సైతం సీజ్ చేశారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కూటీలో ఒరిజినల్ చాయ్స్

బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన నంద కర్ణాటక మద్యం తరలిస్తూ వారం క్రితం స్థానిక సెబ్ అధికారులకు పట్టుబడి రిమాండ్‌కు వెళ్లారు. అయితే అతని కుమారుడు మంజునాథ స్కూటీలో కర్ణాటకకు చెందిన మద్యం 384 ఒరిజినల్ చాయ్స్ టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టణ సమీపంలో సోమవారం పట్టుకున్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పట్టుబడిన మద్యాన్ని, స్కూటీని సీజ్ చేశారు. ఈ దాడుల్లో సీఐతోపాటు సెబ్‌ఎస్‌ఐ దత్తాత్రేయ, హెడ్‌కానిస్టేబుళ్లు దేవరాజులు, క్రిష్ణమాచారి, కానిస్టేబుళ్లు సతీష్‌బాబు, సయ్యద్‌బాషా, అల్తామస్, చక్రినాయక్, సుబ్బయ్య, మురళి పాల్గొన్నారు.

విచారించి చర్యలు తీసుకోండి


అర్జీదారుల సమస్యలు వింటున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ ఆరీఫుల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఏఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో 39 ఫిర్యాదులు వచ్చాయి. ఇవన్నీ మోసం, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, వేధింపులు, ఆర్థిక – ఆస్తి లావాదేవీలకు సంబంధించినవని తెలిపారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదును నిర్ణీత గడువు లోపు విచారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మహిళా స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.

బోయకొండ ఆదాయం రూ.86 లక్షలు

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.86.85 లక్షల ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి ఏకాంబరం తెలిపారు. ఆలయంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. అందులో నగదు రూ.86,85,010, బంగారం 33.10 గ్రాములు, వెండి 690 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. రణభేరి గంగమ్మ ఆలయంవద్ద ఏర్పాటుచేసిన హుండీ ద్వారా రూ.69,888 సమకూరిందన్నారు. ఈ ఆదాయం 37 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) ప్రవేశ పరీక్షకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. విద్యార్థుల కుటుంబ ఆదాయం రూ.3,50,000 లోపు ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈ ఏడాదిలో డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు వివరించారు. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర సందేహాలకు డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని డీఈఓ కోరారు.

కేవీ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలనలో కేవీ త్రిసభ్య కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్:జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ లోని త్రిసభ్య కమిటీ సోమవారం జిల్లా కేంద్రంలో పర్యటించింది. ఆ బృంద సభ్యులు జిల్లా కేంద్రంలోని మంగసముద్రంలో ఉన్న స్థలాన్ని, నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఖాళీ స్థలం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో ఆ కమిటీ సభ్యులు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ కళావతి, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, ఆర్‌ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి హక్కులు కాపాడాలి


డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కృష్ణా, గోదావరి నది జలాల పునఃపంపిణీలో ఆంధ్ర రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి హక్కుల విషయంలో సీఎం ప్రత్యేక జోక్యం చేసుకోవాలన్నారు. సాగునీటి రంగం నిపుణులతో చర్చించాలన్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం పులిచింతల ప్రాజెక్టులో 30.23 టీఎంసీల నీరు నిలువ ఉండేలా నిర్ణయించి అమలు చేయాలన్నారు. కృష్ణా డెల్టాకు జూన్ మొదటి వారంలో నారుమడి పెంచుకోవడానికి నీటిని విడుదల చేయాలని కోరారు. డెల్టాలోని కాలువలకు నీరందించే విధంగా విధి విధానాలు రూపొందించాలన్నారు. డెల్టా ప్రాంతంలోని దాదాపు 70 లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలకు మార్చి నుంచి జూన్ వరకు నాగార్జునసాగర్ నుంచి నీటిని విడదల చేయాలన్నారు. పులిచింతల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని సాగునీటి అవసరాలను బట్టి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మా మొర ఆలకించండయ్యా!

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వేడుకోలు
- వినతులు స్వీకరించిన డ్వామా పీడీ రాజశేఖర్
- ప్రజల నుంచి వచ్చిన మొత్తం అర్జీలు 196


వివిధ ప్రాంతాల నుంచి అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యా....మా మొర ఆలకించండయ్యా అంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. డ్వామా పీడీ రాజశేఖర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ప్రజల నుంచి విచ్చేసే వినతులను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. పలు శాఖలకు సంబంధించి 196 అర్జీలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

కూటమి సర్కారు ధోరణి మార్చుకోవాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జిల్లాలోని పలు శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తున్న కూటమి సర్కారు తన ధోరణిని మార్చుకోవాలని స్కీం వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు అన్నారు. ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కూటమి సర్కారు జిల్లాలోని స్కీం వర్కర్లు, వీవోఏ, ఆర్పీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి హామీ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తొలగించడం దారుణమన్నారు. జిల్లాలో ఎటువంటి నోటీసు లేకుండా తొలగించిన 350 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, నాయకులు గిరిధర్‌గుప్తా, ఓబుల్‌రాజా, లలిత పాల్గొన్నారు.

జీతం వెంటనే విడుదల చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల జీతం వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు నాగరాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య వాపోయారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు ఇవ్వ డం లేదన్నారు. ఈఎస్ఐల సేవలు అమలు కావ డం లేదని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్యకార్మికులు, ఏఐటీయూసీ నేతలు

యానాదుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలో యానాదుల సమస్యలను పరిష్కరించాలని గంగాధరనెల్లూరు మండలం సూరయ్యగారిపల్లి ఎస్టీ కాలనీ, మిట్టపాళ్యం ఎస్టీ కాలనీ గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సూరయ్యగారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన మునస్వామి మాట్లాడుతూ తమకు వ్యవసాయమే జీవనాధారమన్నారు. సర్వే నెంబర్ 73/1 లో 5.43 ఎకరాల భూమి తమకు ఉందన్నారు. అందులోనే సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు. తమ భూమిలో రెండు ఎకరాలు అగ్రకులానికి చెందిన వారు దౌర్జన్యం చేసి ఆక్రమించుకున్నారన్నారు. విచారణ చేసి తమ కు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

అటవీశాఖ అధికారులు ఇబ్బందిపెడుతున్నారు


సమస్యను వెల్లడిస్తున్న సోమల మండలం సూరయ్యగారిపల్లి గ్రామస్తులు

తమ భూమిలో సాగు చేసుకోనివ్వకుండా అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని సోమల మండలం సూరయ్యగారిపల్లి కాలనీవాసులు వాపోయారు. ఈ మేరకు వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన బాలాజీ మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నెంబర్లు 262, 255, 259, 261లో 15 కుటుంబాలకు చెందిన 300 ఎకరాల్లో పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. 2018లో స్థానిక భూస్వాముల సమస్యతో అటవీశాఖ అధికారులు వచ్చి సాగు చేసుకోనివ్వకుండా తమపై దౌర్జన్యం చేశారన్నారు. అప్పటి నుంచి 50 ఎకరాల్లో కొంత మంది సాగు చేసుకుంటున్నారని తెలిపారు. తమపై పట్టాలు ఉన్నప్పటికీ దౌర్జన్యం చేయడం బాధాకరమన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.